క్లుప్తంగా

ఘనంగా జగన్నాథుడి రథయాత్ర



ఆలయం వద్ద ప్రారంభమవుతున్న రథయాత్ర

బీచ్ రోడ్డు: చినవాల్తేరులో జగన్నాథ రథయాత్ర మంగళవారం ఘనంగా జరిగింది. ఇక్కడి జగన్నాథస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర తప్పెటగుళ్లు, డప్పువాయిద్యాలు, పులివేషాల మధ్య చినవాల్తేరులోని వీధుల్లో తిరుగుతూ పోలమాంబ ఆలయానికి చేరుకుంది. ఇక్కడ 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 28న బహుదా యాత్ర ద్వారా ప్రధాన ఆలయానికి తిరిగి వస్తుందని ఆలయ ఈవో సురేష్ తెలిపారు. ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు.

జగన్నాథుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీభరత్, తదితరులు

బీచ్ రోడ్డు: గురజాడ కళాక్షేత్రంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ మాట్లాడుతూ సుభద్ర, బలభద్ర సమేత శ్రీజగన్నాథ స్వామిని ఎవరైతే ఆరాధిస్తారో వారికి స్వామి పరిపూర్ణ కటాక్షం లభిస్తుందన్నారు. అనంతరం అర్చకులు వేదికపై సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి 108 రకాల ప్రసాదాలు నివేద్యం పెట్టి, మహా మంగళహారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీభరత్, ఇస్కాన్ మాతాజీ నితాయ్ సేవిని, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

సూర్యతేజానగర్‌లో బోరు ఏర్పాటు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సూర్యతేజానగర్‌లో నీటి సరఫరా విభాగం అధికారులు మంగళవారం బోరు తీయించారు. ఈ మేరకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి చేతిబోరు తీసే పనులు ప్రారంభించారు. వార్డులో అవసరమైన చోట్ల మరిన్ని తాగునీటి బోర్లు తీయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, పి.ఐ.బాలరాజు, ముద్దాడ పాపారావు, జ్యోతి ప్రకాష్, హుస్సేన్, మోహన్, కనకరాజు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంగీత యూత్ ఫెస్టివల్



కీర్తనలు ఆలపిస్తున్న జయతి, మహతి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సంగీత యూత్ ఫెస్టివల్ మంగళవారం ముగిసింది. ఆఖరి రోజు మంగళవారం నిర్వహించిన కచేరీలో గాత్ర కళాకారులు పెరవలి సోదరీమణులు జయతి, మహతిల వయోలిన్ అద్భుతంగా సాగింది. వీరికి మృదంగంపై సాయి కేశవ్, ఘటంపై కొంటిన్యలు సహకరించారు. అనంతరం కె.నాగ వైష్ణవి గాత్ర కచేరికి కె.గాయత్రి వయోలిన్ సహకారం, జి.చంటి మృదంగంపై సంగీత సహకారం అందించారు.

కొలువులకు కేరాఫ్ సైన్స్ కోర్సులు

- ఇంజినీరింగ్ కోర్సులకు దీటుగా ఆదరణ
- ఈ ఏడాది 800 మంది ఏయూ విద్యార్థులకు ఉపాధి



విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి(ఫైల్)

ఏయూ క్యాంపస్: కార్పొరేట్ సంస్థల్లో కొలువు కావాలంటే ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాలనేది ఒకప్పటి మాట. సైన్స్ కోర్సులు చదివి భారీ వేతనాలతో ఉద్యోగాలు సంపాదించడం సాధ్యపడుతుందని నిరూపించారు ఏయూ విద్యార్థులు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వివిధ సైన్స్ కోర్సులకు భారీ డిమాండ్ ఉంది. ఈ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు పలు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలను సాధించారు. వీరిలో కొంతమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సైతం దక్కించుకున్నారు.

800 మందికిపైగా ఉద్యోగాలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలో ఈ సంవత్సరం ఇప్పటికే 800 మందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఇటీవల జరిగిన అచీవర్స్ డే వేడుకల్లో ఒకే వేదికపై 761 మంది విద్యార్థులకు నియామక పత్రాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అందించారు. సైన్స్ కోర్సులకు అనుగుణంగా అనువైన సంస్థలను వర్సిటీకి ఆహ్వానించి ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నారు. వివిధ దశల్లో విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక ప్రక్రియలు జరుపుతున్నారు. ఏయూ స్టాటిస్టిక్స్ విభాగానికి చెందిన విద్యార్థులు ఫాక్ట్‌సెట్ ఇండియా లిమిటెడ్, టీసీఎస్, ఫినామ్‌పీపుల్ వంటి సంస్థలకు ఎంపికయ్యారు.

ప్రత్యేక తర్ఫీదు

ప్రాంగణ నియామకాలు జరిగే సమయానికి ముందుగా విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించే శిక్షణ ఇచ్చారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు ఇంటర్వ్యూ నైపుణ్యాలు, గ్రూప్ డిస్కషన్‌లో అనుసరించాల్సిన విధానం, మోటివేషనల్ లెక్చర్స్‌ని నిపుణులతో ఇప్పించడం ఎంతో ఉపయుక్తంగా నిలిచింది.

సంక్లిష్టంగా ఇంటర్వ్యూ సాగింది



ఇంటర్వ్యూ విధానం మొత్తం ఐదు దశల్లో జరిపారు. సాధారణంగా పుస్తకాలలో ఉండే అంశాలకు భిన్నంగా రియల్ లైఫ్‌లో ఉండే ఉదాహరణలు చెబుతూ వీటికి శాస్త్రీయ అంశాలను అన్వయించే విధానాలు అడిగారు. స్టాటిస్టిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాల నుంచి ఎంతో లోతైన అవగాహనతో కూడిన ప్రశ్నలు ఇంటర్వ్యూలో ఎదుర్కొన్నా. చివరకు రూ.10.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపిక అయ్యాను.

– మంద కృష్ణ వాసవి, స్టాటిస్టిక్స్ విద్యార్థిని

వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూ



టీసీఎస్ సంస్థకు ఎంపికయ్యా. వార్షిక వేతనంగా రూ.5.4 లక్షలు. అసిస్టెంట్ సిస్టం ఇంజినీర్‌గా ఎంపిక చేశారు. స్టాటిస్టిక్స్‌లో చదువుకున్న అంశాలపై వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూ జరిగింది. వర్సిటీలో నిర్వహించిన అవగాహన, శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయుక్తంగా నిలిచాయి.

– పి.అంజని, స్టాటిస్టిక్స్ విభాగం

అసోసియేట్‌గా ఎంపికయ్యాను



పల్సస్ గ్రూప్‌కి అసోసియేట్ రోల్‌కి ఎంపికయ్యా. ఏయూలో బయోకెమిస్ట్రీ చదివాను. దీనికి సంబంధించిన అంశాలు, ప్రాథమిక ప్రశ్నలు అడిగారు. స్థానికంగా మంచి ఉద్యోగం లభించడం ఆనందంగా ఉంది. సైన్స్ కోర్సుల విద్యార్థులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నారు.

– టి.కావేరి, బయోకెమిస్ట్రీ విభాగం

సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగుతూ..

- 18వ వార్డులో కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రజలతో మమేకమైన వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని తదితరులు

ఎంవీపీ కాలనీ: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం 18వ వార్డులో కొనసాగింది. ఎంవీపీ కాలనీ సెక్టార్–3లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ధనలక్ష్మితో కలిసి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ, ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగారు. గడప గడపకు హారతులు, పూల మాలలతో అక్కరమానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. త్వరలో పలు వార్డుల్లో సామాజిక భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. జగనన్న అధికారంలో ఉంటే రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంక్షేమం వెల్లివిరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

16వ వార్డులో పార్కు పనులకు శంకుస్థాపన



పార్కు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కళాశాల ఎదురుగా ఉన్న గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డులో అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో రూ.12 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, మీసాల ప్రదీప్, పార్వతి పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ఎంవీపీ కాలనీ: యాంటీ ర్యాగింగ్‌పై ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర సీపీ త్రివిక్రమ వర్మ ఆదేశాల మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రూప మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ర్యాగింగ్ జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలి, యాప్ ద్వారా పోలీసులకు ఎలా సమాచారం అందించవచ్చు అనే అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో రమ్మీ ఆడుతున్న యువకులు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ హోటల్‌లో గుట్టుగా రమ్మీ ఆడుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ ప్రాంతంలో ఓ హోటల్‌లో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ హోటల్‌పై మంగళవారం సాయంత్రం దాడి చేశారు. అక్కడ రమ్మీ ఆడుతున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 12 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అరుదైన చికిత్సతో రోగి ప్రాణాలకు రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్

మహారాణిపేట : కదల్లేని స్థితిలో ఉన్న 48 సంవత్సరాల వ్యక్తికి ఓమ్ని ఆస్పత్రి వైద్యుల బృందం విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారని, ఇప్పుడు ఆ వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నారని ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రామ్‌నగర్‌లో ఉన్న ఓమ్ని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ రెస్పిరేటరీ థెరపిస్టుల ఆకుంఠిత దీక్ష, వైద్యుల బృందం అపారమైన బాధ్యత వల్ల ఆ వ్యక్తిని మృత్యువు నుంచి బయటికి తీసుకు రాగలిగామన్నారు. 70 రోజుల కిత్రం కదల్లేని స్థితిలో ఆ వ్యక్తిని తీసుకు వచ్చారని, అతను గులియన్–బారే సిండ్రోమ్ అనే తీవ్రమైన వ్యాధికి గురయ్యాడని తెలిపారు. ఆ వ్యాధిగ్రస్తులు ఒంట్లో కళ్లు తప్ప మరే భాగము కదపలేరని తెలిపారు. అతను ఒడిశాకు చెందిన మాణికేశ్వర్ ప్రసాద్ అన్నారు. అతను అప్పుడు కంటి సైగలు మాత్రమే చేయగలిగేవాడని వివరించారు. ప్రతి లక్ష మందిలో ఇద్దరికి ఇలాంటి వ్యాధి సోకుతుందన్నారు. ఆ సమయంలో డాక్టర్ సతీష్‌చంద్ర రోగికి విజయవంతంగా వైద్య సేవలు అందించారన్నారు. ఇప్పుడు రోగి ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడని వివరించారు. వైద్య బృందం పనితీరు అద్భుతంగా ఉందని ఆస్పత్రికి చెందిన డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ రాధాకృష్ణ వివరించారు. ఈ సమావేశంలో మాణికేశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మహిళ



చికిత్సకు ముందు కొండమ్మ(ఫైల్)



పూర్తి ఆరోగ్యంతో కుటుంబ సభ్యుల చెంతకు చేరిన కొండమ్మ

ఏయూ క్యాంపస్: మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతున్న మహిళకు మానసిక చికిత్సాలయంలో అవసరమైన చికిత్స అందించారు. నేడు పూర్తి ఆరోగ్యంతో ఆమె తన కుటుంబ సభ్యుల వద్దకు చేరింది. వివరాలిలా ఉన్నాయి. విశాలాక్షినగర్ వద్ద రోడ్లపై తిరుగుతున్న కొండమ్మ(45)ని గతేడాది జూన్ 22న మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్చారు. మూడు నెలల అనంతరం చికిత్స తరువాత వ్యాధి నయం కావడంతో ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని మహిళా వసతి గృహంలో చేర్చారు. కొన్ని రోజులు వైద్యులు సూచించిన మందులు వాడటంతో ఆరోగ్యం మరింత మెరుగుపడింది. గతం గుర్తుకు వచ్చి తన పిన్ని రామయ్యమ్మ పద్మనాభం దగ్గర కురపల్లి గ్రామంలో ఉంటోందని చెప్పింది. దీంతో ఆమెను రామయ్యమ్మకు అప్పగించారు. కొండమ్మ పూర్తి ఆరోగ్యంతో తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేసి, వసతిగృహ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

‘ఎంపీ ఎంవీవీ వ్యాఖ్యలు సరికాదు’



మాట్లాడుతున్న సురేంద్ర తదితరులు

ఎంవీపీ కాలనీ : తన వ్యాపారాన్ని హైదరాబాద్‌కు తరలిస్తానంటూ విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్ర అన్నారు. మంగళవారం లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో తన వ్యాపారాలను సజావుగా సాగనివ్వడం లేదంటూ ఎంపీ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇటీవల ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్‌లోను రాజకీయ కోణం దాగి ఉందని ఆరోపించారు. దీనిపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేయిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయన్నారు. రౌడీషీటర్ హేమంత్‌కుమార్‌ను పెంచి పోషించింది ఎవరో తెలియాలని డిమాండ్ చేశారు. విశాఖకు ఉన్న బ్రాండ్ వేల్యూపై దెబ్బతీయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పలువురు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

‘నాలుగేళ్ల డిగ్రీ నిర్ణయం విరమించాలి’



వీసీ ప్రసాదరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఏయూ క్యాంపస్: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల కాలపరిమితితో డిగ్రీ కోర్సులను ప్రవేశ పెట్టాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని అఖిల భారత విద్య పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలు చొరవ తీసుకుని చర్చలు జరపాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, సభ్యులు శ్రీ రామప్రభు, హెనా తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం, యోగా కేంద్రం, రోటరీ క్లబ్స్ ఆఫ్ విశాఖపట్నం సంయుక్తంగా బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నాయి. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం 6 గంటల నుంచి ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో యోగా దినోత్సవం జరగనుంది.

ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.భానుకుమార్, విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అభివృద్ధిపై హర్షం



అల్లుభానుమతి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్మన్, మాజీ శాసన సభ్యురాలు అల్లు భానుమతి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నూతన సాంకేతికతలు, ఇంక్యుబేషన్, స్టార్టప్ రంగాలలో యువతను తీర్చిదిద్దేలా జరుగుతున్న అభివృద్ధి చర్యలు దీర్ఘకాలంలో సత్ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం భూముల పరిరక్షణ, వర్సిటీలో పచ్చదనాన్ని పెంపొందించడంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, అధికారులు చేపడుతున్న చర్యలను అభినందించారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమవర్మ

ఆరిలోవ: నగర సీపీ త్రివిక్రమవర్మ మంగళవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. సీపీ వాహనం వచ్చి స్టేషన్ ఎదుట ఆగేసరికి పోలీసు సిబ్బంది ఒక్కసారిగా కంగుతిన్నారు. అందరూ వెంటనే అప్రమత్తమయ్యారు. ఎక్కడవారు అక్కడే సర్దుకున్నారు. ఇక్కడ స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఇరుకుగా ఉన్న గదులను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు, ఇక్కడ నమోదవుతున్న కేసుల గురించి సీఐ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సిబ్బందికి సీపీ సూచించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్లపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి హనుమంతవాక వద్ద విమ్స్ ప్రాంగణంలో చేపడుతున్న కొత్త పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఎంత వరకు పనులు జరిగాయో ఆరా తీశారు. త్వరితగతిన పనులు చేపట్టాలని ఆదేశించారు.

వైభవంగా పైడిమాంబ జాతర



రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్‌లలో పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా ఆది, సోమవారాలు అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముగింపోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం ఇక్కడ నిర్వహించిన జాతర, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పతకాలు సాధించిన క్రీడాకారులకు వీసీ అభినందన

విశాఖ స్పోర్ట్స్: ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులన ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అభినందించారు. గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో జూన్ 3వ తేదీతో ముగిసిన ఖేలోఇండియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 64 కేజీల వెయిట్ కాటగిరీలో ఎస్.పల్లవి స్వర్ణాన్ని సాధించింది. 87 కేజీల్లో టి.సత్యజ్యోతి రజతాన్ని సాధించగా... 45 కేజీల విభాగంలో బి.రాజేశ్వరి, 89 కేజీల వెయిట్‌లో ఎం.మణికంఠ కాంస్యాలు అందుకున్నారు. ఏయూ తరుపున పాల్గొన్న వీరందరినీ వీసీతో పాటు రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, హెడ్ ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

మూడు స్కూల్ బస్సులపై కేసులు



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఎన్ఏడీ, మద్దిలపాలెం, బోయపాలెం, గాజువాక, షీలానగర్, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏడు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, బాలాజీరావు, హరి ప్రసాద్, మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, పి.శిరీష, సత్యంనాయుడు, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల ఫిట్‌నెస్ పరిశీలన

మహారాణిపేట : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్‌లను అధికారులు మంగళవారం పరిశీలించారు. అంబులెన్స్ పనితీరు, డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించారు. సంఘటన స్థలానికి 15 నిమిషాల్లో చేరుకునేందుకు డ్రైవర్లకు సూచనలు అందజేసి, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, విశాఖపట్నం సిటీ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఉల్లాసం.. ఉత్సాహం

బీచ్ రోడ్డు: ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయడం వల్ల ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉంటారని ప్రముఖ వ్యాయామ నిపుణుడు షీలా కృష్ణస్వామి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఒక హోటల్‌లో యోగా, పౌష్టికాహారం–జీవితంపై ప్రభావం అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీరం, మనస్సు, ఆత్మను సమన్వయం చేసే ప్రక్రియ యోగా అన్నారు.